

భవనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

• నిర్మించారు.. వదిలేశారు

మండల కేంద్రంలోని నిర్మించిన మండల వనరుల కేంద్రం నేటికీ ప్రారంభానికి నోచుకోవడంలేదు. ఈ భవనాన్ని రూ.20లక్షలతో నిర్మించారు. పనులు అయిదేళ్ల పాటు నత్త నడకలా సాగి చివరికి పూర్తైనా అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో గోడలకు పగుళ్లు వస్తున్నాయి. భవన ప్రాంగణం చుట్టూ ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. భవనం కూడా శిథిలావస్థకు చేరుతోంది. ఈ విషయమై మండల విద్యాధికారి వెంకటనర్సింహులును వివరణ కోరగా నీటి వసతికి బోరుమోటరు ఏర్పాటు చేయాల్సి ఉంది. భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో భవనాన్ని ప్రారంభించడం లేదు. మిగిలిన పనులు పూర్తి కాగానే ప్రారంభిస్తామని వివరణ ఇచ్చారు.

– కంది(సంగారెడ్డి)



వాకింగ్‌ట్రాక్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు

• నిరుపయోగంగా వాకింగ్ ట్రాక్

బెల్ యాజమాన్యం కార్మికులు, స్థానిక ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని బెల్ టౌన్‌షిప్ నుంచి పాత ఎంఐజీకాలనీ వెళ్లే మార్గంలో అనేక ఏళ్ల క్రితం వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి వివిధ మొక్కలను నాటారు. కొంతకాలం పాటు వినియోగంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌కు ఆదరణ లభించింది. ఆ తర్వాత కోవిడ్ కారణంగా బెల్ యాజమాన్యం పార్కులతో పాటు ఈ వాకింగ్ ట్రాక్‌ను మూసివేసింది. దీంతో వాకింగ్ ట్రాక్‌పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ విషయాన్ని బెల్ యాజమాన్య దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు గుర్తుచేశారు. ఇప్పటికైనా బెల్ యాజమాన్యం మూతపడిన వాకింగ్ ట్రాక్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



రక్తదానం చేస్తున్న విద్యార్థిని

• రక్తదానం.. మహాదానం

రక్తదానం.. మహాదానమని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, అర్థశాస్త్ర విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి రక్తదాన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా కాలేయం చురుకుగా పనిచేయడమే కాకుండా రక్తదాతకు ఎటువంటి గుండెజబ్బులు రావన్నారు. క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా చాలా తక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ప్రవీణ, వెంకటేశం, డాక్టర్ వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

– సంగారెడ్డి అర్బన్

క్లుప్తంగా

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



నీలం మధును కలిసిన నాయకులు

పటాన్‌చెరు టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మెదక్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి నీలం మధుకు తమ మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో తమ వెంట ఉండి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు నలుగురికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురు హవానదారులను అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

మళ్లీ కాంగ్రెస్‌లోకి షకీల్



షకీల్‌కు పార్టీ కండువా కప్పుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ షకీల్ కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. బీఆర్ఎస్‌కు చెందిన షకీల్ గతేడాది అక్టోబర్ 24న మాజీ మంత్రి చంద్రశేఖర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నవంబర్ 5న అప్పటిమంత్రి హరీశ్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా మంగళవారం ఉదయం మంత్రి దామోదర రాజానర్సింహ సమక్షంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన షకీల్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి వెంట వైస్ ఎంపీపీ గౌసొద్దీన్, నాయకులు రఫీయొద్దీన్ ఉన్నారు.

సీతారామస్వామి ఆలయంలో పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ కుమార్‌యాదవ్ కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టండి

రాయికోడ్(అందోల్): కొలతల ప్రకారం ఉపాధిహామీ పనులు చేపట్టాలని ఎంపీడీఓ షరీఫ్, ఏపీఓ రమేష్ అన్నారు. మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం పనులను చేపట్టాలని సూచించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. 31 గ్రామ పంచాయతీల పరిధిలో 4,905 మంది కూలీలకు పనులు కల్పించినట్లు వివరించారు. కూలీలు ఉదయం 7 నుంచి పనులు ప్రారంభించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. హోర్డింగులు

- భయాందోళనలో వాహనదారులు
- అధికారుల తీరుపై స్థానికుల అసహనం
- తొలగించాలని విజ్ఞప్తి
- వాణిజ్య ప్రకటనల సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు



తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్ వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న భారీ హోర్డింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టానుసారంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. వాటికి తోడు గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా కొనసాగుతుండటంతో వాణిజ్య ప్రకటనలకు మంచి డిమాండ్ పెరిగింది. దీంతో అధికారులు అధిక ఆదాయం పొందవచ్చని ఎక్కడపడితే అక్కడ హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. కానీ.. రోడ్డు పక్కల ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు గాలికి కూలిపోయే ప్రమాదం ఉండటంతో వాహనదారులు రోడ్లపైకి రావాలంటే జంకుతున్న పరిస్థితి నెలకొంది.

అధికారుల తీరుపై అసహనం

అధికారులు ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడం వలనే అధికసంఖ్యలో హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారని అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హోర్డింగ్‌ల వలన ప్రమాదాలు జరగకముందే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హోర్డింగ్‌ల తొలగింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హోర్డింగ్‌లకు నో రెన్యూవల్

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గతంలో అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియాల్ రోడ్డు పక్కల అనేక హోర్డింగ్‌లకు అనుమతులు తీసుకొని ఏర్పాటుచేశారు. గతంలో అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లకు ప్రతి ఏడాది రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే వాటికి రెన్యూవల్ చేయొద్దని ప్రభుత్వం గతంలో ఆదేశాలు ఇవ్వడంతో వాటికి రెన్యూవల్ చేయకుండా తొలగించాలని సుమారు 40కి పైగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన వానిజ్య ప్రకటనల సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నారు.

తొలగించండి



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టానుసారంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి కారణంగా ప్రమాదాలు జరిగే అశకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రెడియల్ రోడ్డు మధ్యలోని డివైడర్లపై కూడా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనాదారులు వాటిని చూస్తూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి హోర్డింగ్‌లను తొలగించాలి.

– సురేష్, స్థానికుడు, తెల్లాపూర్

నోటీసులు జారీ చేస్తున్నాం



గతంలో వివిధ వాణిజ్య సంస్థలు తమ ప్రకటనల నిమిత్తం అనుమతులు తీసుకున్న హోర్డింగ్‌లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పుడు వాటిని రెన్యూవల్ చేయడంలేదు. దీంతో హోర్డింగ్‌లను తొలగించాలని ఆయా సంస్థల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నాం. అయితే రేడియల్ రోడ్డుపై హోర్డింగ్‌లకు ఆర్‌అండ్‌బీ శాఖ వారు అనుమతులు ఇచ్చారు.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

ఆదరించండి.. ప్రజాసేవ చేస్తా

కల్హేర్(నారాయణఖేడ్): జహీరాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తానని ఎంపీగా గెలిపించాలని ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చేందర్ ఓటర్లను అభ్యర్థించారు. మండల పరిధిలోని ఫత్తేపూర్, కృష్ణాపూర్, ఇందిరా నగర్, తదితర చోట్ల మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికలో ఉద్యోగం చేసినా తనకు డబ్బు, సంపాదన ముఖ్యం కాదని, ప్రజాసేవే ముఖ్యమని తెలిపారు. బీజేపీ కులం, మతం పేర్లతో ఓట్లు అడుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. తనను గెలిపిస్తే వెనుకబాటు ప్రాంతం, నిరుద్యోగం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చేందర్

, పారిశ్రామిక, మార్కెటింగ్, రహదారులు, రైల్వే తదితర రంగాలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య, నాయకులు జలంధర్, కారెగామ నాగిరెడ్డి, గుర్రపు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ దండు అంజయ్య

మండల విద్యాధికారి అంజయ్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ దండు అంజయ్య, డీఈ రాంకుమార్ అన్నారు. మండల సమాఖ్య సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి, మరమ్మతులు ఏకరూప దుస్తుల తయారీ, తదితర సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల పేరిట బ్యాంకు ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పనుల పురోగతిపై ఫొటోలు తీసి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎంపీడీఓ లక్ష్మి, ఏఈలు లక్ష్మయ్య, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం నర్సింహులు ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్ అడ్డగింత

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించేలా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు చంద్రయ్య, గోపాలమ్మ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన వాటర్ ట్యాంకర్‌ల ద్వారా ప్రజలకు అందించాల్సిన నీటిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకుంటున్నారని ఆరోపిస్తూ మంగళవారం తాగునీటి ట్యాంకర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ట్యాంకర్లపై మున్సిపల్ కార్యాలయం పేరు రాయించి ప్రతి కాలనీకి తాగునీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ మండల పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ మహేష్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నట్లు గమనిస్తే సమాచారం అందించాలని సూచించారు.

ఆహ్వానపత్రిక అందజేత

జోగిపేట(అందోల్): సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని జోగిపేటలోని పబ్బతి హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు మంత్రి దామోదర రాజనర్సింహాకు



మంత్రి దామోదరకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

ఆహ్వానపత్రికను మంగళవారం అందజేశారు. అందోల్ జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్‌లు ఆకుల చిట్టిబాబు, నాగరాజు, పూజారి లక్ష్మణ రావు, ఆలయ కమిటీ సభ్యులు రఘు, శ్రీనివాస్, రవి తదితరులు ఉన్నారు

ఐక్యతకు ప్రతీక ఈద్‌మిలాప్



మాట్లాడుతున్న మొహియొద్దీన్

సదాశివపేట(సంగారెడ్డి): హిందూ ముస్లింల ఐక్యతను ప్రతీక ఈద్‌మిలాఫ్ అని జమాతే ఇస్లామి హింద్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మొహియొద్దీన్ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఎస్‌ఐ ఫంక్షన్ హాల్‌లో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకుడు సాయినాథ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పులిమామిడి రాజు, బొడపల్లి రవి, జేఏసీ కన్వీనర్, గిరిప్రాసాద్, ముగ్దుం, రఫీక్ ఉరరహ్మాన్, షరీపొద్దీన్, నిజామొద్దీన్, అబ్దుల్ వాజీద్, జమాతే కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోండి



ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్

హత్నూర(సంగారెడ్డి): వచ్చే నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసిల్దార్ పర్వీన్‌షేక్ అన్నారు. హత్నూర మండల కేంద్రంలో మంగళవారం టూ కే రన్ ద్వారా ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఆర్ఐ శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం

వట్‌పల్లి(అందోల్): జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో కరపత్రాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కాల్వమీది రమేశ్, నాయకులు ప్రకాశం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండలంలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిన్నారం మండలంలో...

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బొల్లారం మున్సిపాలిటీలో ఆందన్‌కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, మేఘన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

ఖేడ్‌కు చేరిన ఈవీఎంలు

నారాయణఖేడ్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు మంగళవారం జిల్లా కేంద్రం సంగారెడ్డి నుంచి ఖేడ్‌కు చేరాయి. మండల పరిధిలోని జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో వీటిని భద్రపరిచారు. డీఎస్పీ వెంకటరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తాహెర్ అలీ, పరమేష్, మోహిద్‌ఖాన్, సాయిరాం, హైదర్‌నవాబ్ తదితరుల సమక్షంలో ఆర్డీఓ అశోక్ చక్రవర్తి స్ట్రాంగ్ రూంకు సీలు వేశారు.



స్ట్రాంగ్ రూంకు సీలు వేసిన ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, నాయకులు, పోలీసు అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా హంసవాహన సేవ**



నారాయణఖేడ్: పట్టణంలోని చారిత్రాత్మక సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు నాలుగో రోజైన మంగళవారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా హంసవాహన సేవ, జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో కీర్తన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. హంసవాహన సేవలో భాగంగా హంసవాహనాన్ని రామాలయం నుంచి పట్టణ పుర వీధుల గుండా రామాలయం వరకు ఊరేగించారు.

◆ **'గెలిపిస్తే మరింత అభివృద్ధి'**

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీ, లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. మంగల్‌పేట్‌లోని బీజేపీ కార్యాలయం నుంచి ఖేడ్ రాజీవ్ చౌక్ కూరగాయల మార్కెట్ మీదుగా పలు వీధుల్లో నడుచుకుంటూ ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఖేడ్ నియోజకవర్గంలో ఎంపీగా తాను చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. అనంతరం వారాంతపు సంతలో పాటిల్ కూరగాయలు విక్రయించారు. హోటళ్లలో టీ తయారు చేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. బీజేపీ సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌రాజ్, బీజేపీ గిరిజన మోర్చా జాతీయ నాయకుడు అమర్‌సింగ్, సంగమేశ్వర్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

◆ **మునిపల్లికి నేడు మంత్రి రాక**

మునిపల్లి(అందోల్): మండలంలోని చిన్నచల్మెడ గ్రామంలో బుధవారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి మంగళవారం ఒక ప్రటకనలో తెలిపారు. అలాగే మక్తక్యాసారం ఆత్మానందాశ్రమం, తాటిపల్లి, బుదేరా తదితర గ్రామాల్లో రాముని కల్యాణం వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

◆ **పంటల సాగుపై అవగాహన**

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు వరి, ఆయిల్ పామ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంభించడం, పెట్టుబడులను తగ్గించుకుని అధిక దిగుబడి పొందడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, ఏఈఓ యాదయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.